

**జయకేతనం** | మానుకోట రోడ్‌షోలో అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న కేసీఆర్. చిత్రంలో ఎంపీ అభ్యర్థి కవిత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



**రణన్నినాదం** | మానుకోటలో రోడ్డుపొడవునా కిక్కిరిసిన జనానికి విజయసంకేతం చూపుతున్న కేసీఆర్



కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో బస్సుయాత్రకు హారతులిస్తున్న మహిళలు

# జన ప్రభంజనం

- మహబూబాబాద్‌లో కేసీఆర్‌కు అపూర్వస్వాగతం
- గిరిజనులు, మహిళలతో నిండిన మానుకోట రోడ్లు
- జై కేసీఆర్.. సీఎం కేసీఆర్ అంటూ హోరెత్తిన నినాదాలు

వరంగల్, మే 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/భద్రాద్రి కొత్తగూడెం: నేల ఈనిందా అన్నట్టుగా నలుదిక్కులా మానుకోటలో జనం పోటెత్తారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షోకు భారీ ఎత్తున తరలివచ్చిన జనంతో ఇందిరా జంక్షన్ కిటకిటలాడింది. జై కేసీఆర్.. సీఎం కేసీఆర్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మహబూబాబాద్‌లో కేసీఆర్ నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. కొత్తగూడెం నుంచి వచ్చే రోడ్డులో కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు జనం బారులు తీరారు. రెండు కిలోమీటర్ల పొడవునా ప్రజలు కేసీఆర్‌కు అపూర్వస్వాగతం పలికారు. కేసీఆర్ బస్సు యాత్ర ప్రవేశించినప్పటి నుంచి మహబూబాబాద్ పట్టణంలో నుంచి రోడ్ షో ముగిసే వరకు బస్సుతోపాటే వేలాది జనం వెంట నడిచారు. డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములు గు, ఇల్లందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలతో పట్టణంలోని వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు జనం ఓపికగా వేచి చూశారు. కేసీఆర్ ప్రసంగానికి మధ్యలో పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తెలంగాణ మలి ఉద్యమంలో మహబూబాబాద్‌తో ఉన్న అనుబంధం, అక్కడి పోరాటాలను కేసీఆర్ గుర్తు చేసినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. సమైక్య రాష్ట్రంలో ఈ ప్రాంతానికి, గిరిజన వర్గాలకు జరిగిన అన్యాయాన్ని కేసీఆర్ వివరించారు. కేసీఆర్ ప్రసంగానికి అడుగడుగునా నినాదాలు హోరెత్తాయి. ఈలలు, చప్పట్లు మార్మోగాయి.

### కొత్తగూడెంలో నీరాజనం

ఉద్యమనేత, గులాబీ దళపతి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో విజయవంతమైంది. అడుగడుగునా జనం నీరాజనం పలికారు. ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నట్టు సంకేతాలు ఇచ్చారు. ముఖ్య నేతలతో మంగళవారం రాత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి దిశానిర్దేశం చేశారు. కొత్తగూడెం సింగరేణి అతిథి గృహంలో రాత్రి బసచేసిన కేసీఆర్‌ను బుధవారం కలిసేందుకు జనం బారులుదీరారు. కేసీఆర్ కోసం భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో సింగరేణి గెస్ట్‌హౌస్ అభిమానులతో సందడిగా మారింది.

### వనమా ఇంటికి వెళ్లిన కేసీఆర్

కొత్తగూడెంలో బస చేసిన కేసీఆర్‌ను మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పాల్వంచలోని తన ఇంటికి ఆహ్వానించారు. బుధవారం సాయంత్రం బస్సులో కేసీఆర్ పాల్వంచకు వెళ్లారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి వనమా కుటుంబసభ్యులు ఘనస్వాగతం పలికారు. వనమా ఇంట్లో తేనేటి విందు స్వీకరించిన కేసీఆర్ వారి కుటుంబసభ్యులతో మాట్లాడి మహబూబాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.



మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో కేసీఆర్

# మరి రేవంత్ మాటల సంగతేంది?

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ప్రాణమున్నంత వరకు తెలంగాణకు అన్యాయం జరగనివ్వబోనని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌కు స్వప్రయోజనాలు ఉండవని, ప్రతిక్షణం ప్రగతి కోసం, ప్రతి మాట ప్రజల కోసం, ప్రతి అడుగు ప్రజల కోసమేనని పేర్కొన్నారు. ఇది తెలంగాణ ఇంటి పార్టీ అని తెలిపారు. తెలంగాణ హక్కులు, నీళ్లను కాపాడేందుకు, నిధులను రాబట్టేందుకు, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ పనిచేస్తుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### మహబూబాబాద్ జిల్లా ఉండాల్నా?.. పోవాల్నా?

45 డిగ్రీల ఎండలోనూ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన మహబూబాబాద్ ప్రజలను చూసి కేసీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. ''మహబూబాబాద్ మారుమూల ప్రాంతం. గిరిజన ప్రాంతం. ఇక్కడికి అభివృద్ధి రావాలని ఆలోచన చేసినం. ఎంతో ప్రేమతో మహబూబాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసుకున్నం. కానీ ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబాబాద్ జిల్లాను రద్దు చేస్తామంటున్నది. ఒక్క మాట అడుగుతున్నా. మహబూబాబాద్ జిల్లా ఉండాల్నా? పోవాల్నా? జిల్లా ఉండాలంటే, ఈ ముఖ్యమంత్రి మెడలు వంచాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత గెలవాలె. మహబూబాబాద్ జిల్లాను తీసేస్తానని కాంగ్రెస్ ముఖ్యమంత్రి చెప్తున్నడు. జిల్లా ఉండాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'' అని కేసీఆర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ ప్రాంతంలో తాగునీళ్లు వచ్చేవి కావని, కాంగ్రెస్ యాభై ఏండ్ల పాలనలో ఎస్సారెస్పీ స్టేజ్-2 అని చెబితే ఎన్నడూ నీళ్లు రాలేదని, కాళేశ్వరం కట్టిన తరువాత తాను కష్టపడి, ఇక్కడి నాయకుల ఆధ్వర్యంలో వెన్నవరం కాలువ తవ్విన తరువాతనే నీళ్లు వచ్చాయని గుర్తుచేశారు. ఆ కెనాల్‌కు ఈ ఏడాది నీళ్లు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.



బుధవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన రోడ్ షోలో ప్రసంగిస్తున్న కేసీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

> మారుమూల ప్రాంతమైన మహబూబాబాద్‌ను అభివృద్ధి చేయాలని ఎంతో ప్రేమతో ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడీ జిల్లాను రద్దు చేస్తామంటున్నది. మరి ఈ జిల్లా ఉండాల్నా? వద్దా?
> -కేసీఆర్

### ఆరు గ్యారెంటీలతో ఆగం

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరిట అరచేతిలో వైకుంఠం చూపించి, అడ్డగోలు హామీలు ఇచ్చి, రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఉసురు పోసుకుంటూ ఉన్నదని కేసీఆర్ నిప్పులు చెరిగారు. ''రైతు బంధు వచ్చిందా? ఎవరికన్నా 2,500 రూపాయలు వచ్చినయా? తులం బంగారం వచ్చిందా? ఏదీ కూడా రాలె'' అని కేసీఆర్ అనగానే ప్రజల నుంచి అవునంటూ పెద్ద ఎత్తున స్పందన లభించింది. ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్ ఉచిత బస్సు ఒక్క హామీనే నెరవేర్చిందని తెలిపారు. ఈ పథకం వల్ల ఆటో రిక్షా కార్మికులంతా రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారి బతుకులు ఆగమవుతున్నాయని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల కోసం పథకం తీసుకురావడం మంచిదే కానీ, దానివల్ల వచ్చే బాధలు, ఇబ్బందులను కూడా గమనించి ఆటోకార్మికులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉండి కొట్లాడుతుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో రైతుబంధు రాలేదని, కాలువల నీళ్లు రావడం లేదని, కరెంటు సక్కగ ఇవ్వడం లేదని, మళ్లా బోరుబండ్లు వస్తున్నాయని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు.

### రైతులు చనిపోతున్నరు

కాంగ్రెస్ దుష్ట పరిపాలన వల్ల అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో 15 రోజులైనా వడ్లు కొనకపోవడంతో తట్టుకోలేక, వాటిని ఆరబెడుతూ అక్కడే గుండె ఆగి రైతు చనిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపించి తెలంగాణ ప్రజలను దగా చేసిందని, మోసం చేసిందని నిప్పులు చెరిగారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ మళ్లీ కాంగ్రెస్ గెలిస్తే ఇక హామీలను అమలు చేయకున్నా ఏం కాదని, వాగ్దానాలన్నింటినీ పండబెడతుందని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని, ప్రజల తరఫున నిలబడుతున్న బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

### బీజేపీ ఒక్క పనన్నా చేసిందా?

బీజేపీ విధానాలపై నిప్పులు చెరిగిన కేసీఆర్.. మోదీ ప్రభుత్వంలో ఈ దేశంలో ఒక్క పని అయినా అని ప్రశ్నించారు. ఎవరికైనా రూ.15 లక్షలు వచ్చాయా? అని నిలదీశారు. 'భేటీ పడావో-భేటీ బచావో', 'అమృత్‌కాల్' వంటివి నినాదాలే తప్ప ఏ ఒక్క పనీ జరగలేదని ధ్వజమెత్తారు. ఇప్పుడేమో మోదీ మన గోదావరిని ఎత్తుకుపోతామని అంటున్నా, ముఖ్యమంత్రి మాత్రం నోరుమూసుకుని ఉన్నాడని మండిపడ్డారు. కృష్ణానదిని ఇప్పటికే కేఆర్ఎంబీకి అప్పగించాడని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### కరెంటు ఎక్కడికి పోయింది?

ఖమ్మం పట్టణంలో మురికినీళ్లు వస్తున్నాయని, మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేటలో తాగునీటి సమస్య నెలకొందని కేసీఆర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు మంచిగ నడిచిన కరెంటు ఏమైపోయిందని, మిషన్ భగీరథ ఎక్కడికెళ్లిందని ప్రశ్నించారు. ప్రజలు ఈ విషయాలను ఆలోచించాలని కోరారు. 70 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడూ, ఎక్కడా గిరిజనులను గౌరవించలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో సేవాలాల్ బంజారా భవనాన్ని సత్యవతిరాథోడ్ నేతృత్వంలో కట్టించామని, 10 శాతం రిజర్వేషన్లు పెట్టుకున్నామని, తండాలన్నీ పంచాయతీలుగా చేసుకున్నామని వివరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ప్రతాపం చూపాలని కోరారు. ''రైతులకు కేసీఆర్ రూ.10 వేలు ఇస్తుండు. మేం రూ.15 వేలు ఇస్తామన్నారు? కానీ, రూ. 15వేలు కాదు కదా పాత రూ.10వేలు కూడా రాలేదు. రైతు కూలీలకు నెలకు రూ. 1200 ఇస్తామన్నారు. ఏ రైతు కూలీకైనా వచ్చిందా? ఒక్క ఉచిత బస్సు తప్ప ఆరు గ్యారెంటీలను మొత్తం ఆగం చేసిండు. అందరినీ ఆగం పట్టే పనిచేశారు. ఇవాళ తాగునీళ్ల బాధ, కరెంట్ బాధ, వడ్లు కొనే పరిస్థితి లేదు. 500 బోనస్ లేదు. వచ్చే పరిస్థితి కూడా లేదు'' అని కేసీఆర్ నిప్పులు చెరిగారు. ఈ ఎన్నికల్లో యువకులు, లంబాడా యువకులు, మేధావులు, గిరిజనులు అందరూ ఏకమై, ఆలోచనతో పనిచేయాలని, అప్పుడే విజయం సాధిస్తామని తెలిపారు. విచక్షణతో ఆలోచించి బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఎట్లుండె, కాంగ్రెస్ వచ్చాక ఈ 5 నెలల్లో ఎట్ల అయిపోయింది? కారణం ఏంది? అనేది ఆలోచించాలని కోరారు.

> మహిళల కోసం ఉచిత బస్సు పథకం తీసుకురావడం మంచిదే. కానీ, దాని వల్ల వచ్చే బాధలు, ఇబ్బందులను కూడా గమనించాలె. ఆటోకార్మికులకు తగిన న్యాయం చేయాలె. వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉండి కొట్లాడుతుంది.
> -కేసీఆర్

### అన్యాయం జరగనివ్వను

''ఇంత వయసొచ్చినా తెలంగాణ ప్రజలను కాపాడాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ వారిని ఆగం కానివ్వద్దని వచ్చిన. నా ప్రాణమున్నంత వరకూ తెలంగాణకు ఎట్టిపరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వను. నేను హామీ ఇస్తున్నా? ఎన్నికల కమిషన్ నిషేధం వల్ల ఎక్కువ మాట్లాడలేకపోతున్న. కవిత బ్రహ్మాండమైన నాయకురాలు. మచ్చలేని మనిషి. అందరి ఆదరాభిమానాలు పొంది ఐదేండ్లు గొప్పగా పనిచేశారు. మరోసారి అవకాశమిస్తే తెలంగాణ హక్కులను, నీళ్లను కాపాడడానికి, నిధులను రాబట్టడానికి, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు పనిచేస్తారు. కాబట్టి కవితను కచ్చితంగా గెలిపించాలె. మహబూబాబాద్‌లో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒక ఉప్పెనలా తరలివచ్చారు. మహబూబాబాద్‌లో నేల ఈనిందా అన్నట్లుగా తరలివచ్చారు. ఆవేశపూరితంగా తరలివచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు'' అని కేసీఆర్ ముగించారు.

> 70 ఏండ్ల పాలనలో కాంగ్రెస్ ఏనాడూ గిరిజనులను గౌరవించలే. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో సేవాలాల్ బంజారా భవనాన్ని నిర్మించాం. వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాం. తండాలను పంచాయతీలు చేశాం.
> -కేసీఆర్



**ఆనంద హేల** | రోడ్‌షోకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న మహబూబాబాద్ అభ్యర్థి మాలోత్ కవిత. చిత్రంలో మాజీమంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, హరిప్రియానాయక్



# అదే కేసీఆర్.. అదే క్రేజ్

## ప్రచారాన్ని మలుపుతిప్పిన రోడ్‌షోలు • బీఆర్ఎస్ శ్రేణుల్లో కదనోత్సాహం
## యాత్రకు పోటెత్తుతున్న జనం • కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల్లో నైరాశ్యం

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కోసం 14 ఏండ్లు అలుపెరుగని పోరాటం.. ఆపై పదేండ్లపాటు తెలంగాణ పునర్నిర్మాణం. అలుపెరగని పని.. నిత్యం బిజీబిజీ.. ఇది ఒకవైపు. కేసీఆర్ ఎవర్నీ కలవరంటూ నిందలను నిజాలుగా నమ్మించే ప్రచారం. అయినా కేసీఆర్‌పై ప్రజల్లో ఉండే అభిమానం మాత్రం ఇసుమంతైనా చెరిగిపోలేదని ఇటీవలి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. జనంలో కేసీఆర్‌కు ఉండే క్రేజే వేరని నిరూపిస్తున్నాయి. ఆయన రోడ్‌షోలకు పోటెత్తుతున్న జనమే ఇందుకు ఇందుకు నిదర్శనం. గతనెల 24న మిర్యాలగూడలో మొదలై సూర్యాపేట, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్‌లలో కేసీఆర్ రోడ్‌షోలు నిర్వహించారు. ఇవి రోడ్‌షోలే అయినా బహిరంగ సభలను తలపిస్తున్నాయి. ఆయన ప్రసంగాలకు జనం జై కొడుతున్నారు. కేసీఆర్ ఇప్పటివరకు నిర్వహించిన రోడ్‌షోల ద్వారా ప్రజలతో మమేకం అయ్యారు. గులాబీ బాస్‌కు స్వాగతం పలికేందుకు యువత ఉరకలెత్తుతున్నది. కేసీఆర్‌ను పిల్లలకు చూపిస్తూ తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. ఆయనతో ఫొటోలు, సెల్ఫీల కోసం తహతహలాడుతున్నారు.

### గుండెల్లో గులాబీనాదం

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ పని ఇక అయిపోయినట్టేనని కాంగ్రెస్, బీజేపీ పనిగట్టుకొని ప్రచారం చేశాయి. సోషల్ మీడియా వేదికగా ఈ ప్రచారం జోరుగా సాగింది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే కేసీఆర్ జనంలోకి రావడం, నల్లగొండ, కరీంనగర్ సభల్లో తానున్నానంటూ రైతు లోకానికి కేసీఆర్ భరోసా ఇవ్వడంతో సమీకరణల్లో ఒక్కసారిగా మార్పు మొదలైంది. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లో అకాల వర్షాలు, సాగునీటి కష్టాలతో అల్లాడుతున్న రైతు లోకానికి ధైర్యం కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఈ పరిణామాలు పార్లమెంట్ ఎన్నికల ముంగిట రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీకి మింగుడుపడని అంశాలుగా పరిణమించాయి. గత నెల 24 నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కేసీఆర్ జనంలోకి రావడంతో అప్పటిదాకా ఉన్న వాతావరణంలో మార్పు మొదలైంది. ఆ మార్పును బీఆర్ఎస్ శ్రేణులే కాకుండా కాంగ్రెస్ కూడా గుర్తించింది. 'కేసీఆర్ జనంలోకి వస్తే జనం మూడ్‌ను తిరిగి తమవైపునకు తిప్పుకోవడం కష్టం' అని ప్రభుత్వంలో క్రియాశీల పాత్రపోషిస్తున్న నాయకుడు ఒకరు స్వయంగా ముఖ్యమంత్రితో పేర్కొన్నప్పుడు ఆయన అసహనం ప్రదర్శించినట్టు తెలిసింది.



కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో కేసీఆర్ బస్సుపై పూలవర్షం కురిపిస్తున్న శ్రేణులు. (ఇన్‌సెట్) బస్సుకు పాలాభిషేకం చేస్తున్న అభిమానులు

### సందిగ్ధం నుంచి స్పందన

అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలకు, ప్రస్తుతం కేసీఆర్ నిర్వహిస్తున్న రోడ్‌షోలకు స్పష్టమైన తేడా కనిపిస్తున్నది. అప్పట్లో జనం నుంచి ఆశించినంత స్పందన రాలేదు. ఇప్పుడు మాత్రం కేసీఆర్ చెప్తున్న ప్రతి మాటను ఆలకిస్తున్నారు. కేసీఆర్ అడిగే ప్రశ్నలకు స్పందిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హామీల అమలపై ప్రజల్లో మొదలైన అసంతృప్తి క్రమంగా పెరిగి పెద్దదైంది. కేసీఆర్‌ను పోగొట్టుకుని తాము ఏం కోల్పోయామో తెలుసుకున్న ప్రజలు ఇప్పుడు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. ఇది బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారింది.

### గులాబీ జయకేతనమే

**కేసీఆర్** రోడ్‌షోలకు వస్తున్న స్పందనతో పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ జయకేతనం ఖాయమేనని తేలిపోయింది. రోడ్‌షోల సందర్భంగా కేసీఆర్ ఆయా నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. నల్లగొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియెజకవర్గాల్లో రోడ్ షోలకు హాజరైన ప్రజలతో కేసీఆర్ సంభాషించారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు తెలంగాణ ప్రయోజనాలకు ఎలా అనివార్యమే వివరించారు. అంతకుముందు చేవెళ్ల, జహీరాబాద్, మెదక్ లోక్‌సభ పరిధిలో, ఎన్నికల షెడ్యూల్‌కు ముందు నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించడం, ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో కష్టాల్లో ఉన్న రైతులకు ధైర్యాన్ని ఇవ్వడం వంటి పరిణామాలతో తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ మాట వింటున్నారు. కేసీఆర్ నడిచిన బాటనే నడుస్తామనే స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నారు.